# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఈరోజు రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైంది.
- రక్షణ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు భారత్ గత దశాబ్ద కాలంగా పలు సంస్కరణలను ప్రవేశపెట్టిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ లో తొలి విడతకు, తమిళనాడులో ఒకే విడతకు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల సంఘం అందించిన వివరాల మేరకు తమిళనాడులో రికార్డు స్థాయిలో 82.24 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 38 జిల్లాలకు గానూ 30 జిల్లాలో 80 శాతం కంటే అధికంగా ఓట్లు పోలయ్యాయి. 89 శాతం ఓటింగ్ తో కరూర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా.. రాజధాని చెన్నైలో 83.4 శాతం ఓటింగ్ జరిగింది. తుది పోలింగ్ శాతం వివరాలను ఎన్నికల సంఘం ఇంకా వెల్లడించాల్సి ఉంది. మరోవైపు పశ్చిమ బెంగాల్ శాసనసభకు జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఈ సాయంత్రం 5 గంటలకు 90 శాతం పైగా పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది. దక్షిణ దినాజ్ పూర్ లో అత్యధికంగా 93.12 శాతం ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ లో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 6వ స్నాతకోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్ ఈరోజు పాల్గొని ప్రసంగించారు. పట్టభద్రులందరూ

వృత్తిపరమైన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని ఆయన కోరారు. దేశ నిర్మాణంలో నిజాయితీ, నిబద్ధతలతో సేవలందించాలని పట్టభద్రులకు సూచించారు. ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ గురించి ప్రస్తావిస్తూ.. గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్ సంస్థలు ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను, వైద్య విద్యను ప్రజలకు చేరువ చేశాయని చెప్పారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని వారికి సేవ చేయడమే సుపరిపాలనకు అసలైన అర్థమని ఆయన వ్యాఖ్యానించారు. రిషికేశ్ ఎయిమ్స్‌లో ఆవిష్కరణలు, టెలిమెడిసిన్ సేవలను ఈ సందర్భంగా అభినందించారు. వైద్య సేవలు కేవలం ఆసుపత్రులకే పరిమితం కాకూడదని, మారుమూల ప్రాంతాల్లోని చిట్ట చివరి వ్యక్తి వరకు చేరాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు భారత్ గత దశాబ్ద కాలంగా పలు వ్యవస్థాగత సంస్కరణలను ప్రవేశపెట్టిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జర్మనీలో పర్యటిస్తోన్న రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు మ్యూనిచ్ నగరంలో నిర్వహించిన డిఫెన్స్ ఇన్వెస్టర్ సమ్మిట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్, జర్మన్ రక్షణ రంగ ప్రముఖులనుద్దేశించి ప్రసంగిస్తూ... భారతదేశంతో కలిసి రక్షణ ఉత్పత్తులను అభివృద్ధి పరిచేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రేడార్ సెన్సార్ సాంకేతికతలు, కృత్రిమ మేధ ఆధారిత మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నీటి అడుగున పనిచేసే శక్తివంతమైనలో ఫ్రీక్వెన్సీ ట్రాన్స్‌మీటర్లు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్, జర్మనీలు కలిసి పని చేయాలని ఆకాంక్షిస్తున్నట్టు రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇవి ప్రజలను భయాందోళనలకు గురిచేసే ఉద్దేశపూర్వక తప్పుడు వార్తలని, ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని ఇటీవలి పరిణామాలపై న్యూ ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పెట్రోల్, డీజిల ధరలు పెంపుపై  సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను ఖండిస్తూ.. సామాన్యులపై ఇంధన భారాన్ని మోపే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షా 50 వేలకు పైగా దాడులు నిర్వహించి, 66 వేలకు పైగా అక్రమంగా విక్రయిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 41 వేల మంది ఎల్‌పిజి కనెక్షన్‌ల నుంచి పీఎన్‌జీకి మారారని వెల్లడించారు. ఏప్రిల్ 1 నుండి 17 లక్షలకు పైగా 5 కేజీల ఎఫ్‌టిఎల్ సిలిండర్లు అమ్ముడయ్యాయని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

తమ గగనతలం మీదుగా ప్రయాణించే భారతీయులకు ఇకపై ట్రాన్సిట్ వీసా అవసరం లేదని ఫ్రాన్స్ ప్రకటించింది. వీసా ఫ్రీ ట్రాన్సిట్ సదుపాయాన్ని ఫ్రాన్స్ అమలులోకి తేవడం పట్ల భారత్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమాన్యుల్ మ్యాక్రాన్ ముంబైలో సమావేశమైనప్పుడు.. ఇందుకు సంబంధించి ఒప్పందం కుదిరిందని విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ట్రాన్సిట్ వీసా అవసరం లేని సదుపాయం ఈనెల 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు చెబుతూ.. ఇరు దేశాల మధ్య పౌరుల రాకపోకల సులభతరం సహా సంబంధాల బలోపేతానికి ఇది సంకేతమని జైస్వాల్ తెలిపారు.

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ సవాళ్ల తరుణంలో భారత్-ఆఫ్రికా భాగస్వామ్యం ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. నేడు భారతదేశ విదేశాంగ విధానంలో ఆఫ్రికా కీలకంగా మారిందని, ఇటీవలి సంవత్సరాలలో భారతదేశం ఆఫ్రికాలో తన దౌత్య సంబంధాలను విస్తరించుకుందని చెప్పారు. మే 28 నుంచి 31 వరకు జరగనున్న ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ లోగో, థీమ్, వెబ్‌సైట్‌లను ఆయన ఈరోజు న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆఫ్రికా వ్యాప్తంగా 17 కొత్త దౌత్య కార్యాలయాలను ప్రారంభించడంతో, అక్కడ ఉన్న కార్యాలయాల సంఖ్య 46కు చేరిందని తెలిపారు. ఆ ఖండంలోని ప్రతి ప్రాంతంతోనూ సంబంధాలు కొనసాగించాలనే భారతదేశపు దీర్ఘకాలిక నిబద్ధతను ఇది ప్రదర్శిస్తుందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర్ పప్పుధాన్యాల మిషన్‌లో భాగంగా బీహార్‌లో తొలిసారిగా పప్పుధాన్యాలు (ముఖ్యంగా మసూర్ కందిపప్పు) నిర్మాణాత్మక సేకరణను ప్రభుత్వం ప్రారంభించింది. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (NCCF) బీహార్‌లో మసూర్ పప్పు సేకరణ చేపట్టింది. పప్పు సేకరణ కోసం 32 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రారంభ దశలోనే దాదాపు 100 మెట్రిక్ టన్నుల మసూర్ పప్పు సేకరణ పూర్తయింది. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు మద్దతు ధర (MSP) కల్పించి, వారి ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో ఇ-సంయుక్తి పోర్టల్ ద్వారా డిజిటలైజ్డ్ రైతు భాగస్వామ్యం, విస్తృత అవగాహన ప్రచార కార్యక్రమాల వల్ల PM-AASHA కింద పప్పుధాన్యాల సేకరణ గణనీయంగా పెరిగింది. శనగల సేకరణకు 63 వేల 325 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఇప్పటివరకూ 16 వేల 012 మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ముంబై తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =